

పోలీసులకు పరామర్శ
పుంగనూరు ఘటనలో గాయపడిన పోలీసులను మంత్రులు, అధికారులు పరామర్శించారు. - 10లో



ఆశలు మడుగులో కలసిపోయాయి
వెదురుకుప్పం మండలంలోని మద్దెమాను మడుగు ప్రాజెక్టులో ఓ విద్యార్థి మునిగిపోయాడు. - 10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	25
తిరుపతి	38	26
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	38	26

న్యూస్‌రీల్

14న యాదవుల ఆత్మీయ సమావేశం



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వెంకటరెడ్డియాదవ్ తదితరులు

పుంగనూరు : మండలంలోని రాంపల్లె వద్ద జగనన్న కాలనీ మైదానంలో ఈ నెల 14వ తేదీన యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తెలిపారు. శనివారం ఆయన యాదవ సంఘం ప్రతినిధులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ యాదవుల ఐక్యతను చాటేలా ప్రతిష్టాత్మకంగా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యాదవుల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యయాదవ్, నరసింహులు, నారాయణరెడ్డి, సుబ్బన్న, రమణ పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం మిషన్ ఇంద్ర ధనస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ ప్రభావతి, డీఐఓ రవిరాజు మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 1,730 కేంద్రాల ద్వారా గర్భిణులు, పిల్లలకు టీకాలు వేయించనున్నట్లు వెల్లడించారు. పీహెచ్‌సీల ద్వారా ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ సుదర్శన్, డీఎస్‌ఓ శిరీష, డీఎంఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

'చాగంటి'కి ఆహ్వానం



చాగంటి కోటేశ్వరరావుకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి విచ్చేయాలని ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావును ఆహ్వానించారు. శనివారం కాకినాడలోని చాగంటి నివాసానికి వెళ్లి కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆహ్వానం పలికారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

7న జాతీయ చేనేత దినోత్సవం



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఈ నెల 7వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చేనేత దినోత్సవం రోజున ఉద్యోగులు, కార్మికులు, రైతులు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా చేనేత దుస్తులను ధరించాలని సూచించారు. నేతన్నల సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆడుదాం ఆంధ్ర మస్కట్ లోగో ప్రతిపాదనలను పంపాలని ఆదేశించారు. లోగో తయారుచేసి 10 లోపు www.aadudhamaandhra.com వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు.

పచ్చమూకలపై ప్రజాగ్రహం

పచ్చమూకల దాడిపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు సృష్టించిన అల్లర్లపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. చంద్రబాబు కుట్రపూరిత వ్యవహారశైలిపై ఆందోళన ఆకాశాన్నంటింది. శనివారం జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన బంద్‌కు అన్ని వర్గాల సంపూర్ణ మద్దతు లభించింది. శాంతియుతంగా నిర్వహించిన పాదయాత్రలు.. ర్యాలీల్లో ప్రజానీకం స్వచ్ఛందంగా పాల్గొంది. అధికారదాహంతో రాయలసీమలో ఫ్యాక్షన్ సంస్కృతికి పునరుజ్జీవం పోస్తున్న టీడీపీ అధినేతపై మండిపడింది.

- జిల్లా బంద్ విజయవంతం
- పలుచోట్ల చంద్రబాబు దిష్టిబొమ్మల దహనం
- శాంతియుతంగా నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- స్వచ్ఛందంగా సహకరించిన ప్రజలు
- పోలీసులకు మద్దతుగా ర్యాలీలు
- యథావిధిగా కొనసాగిన అత్యవసర సర్వీసులు

సాక్షి, చిత్తూరు : జిల్లాలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం పుంగనూరులో చంద్రబాబు ఉసిగొల్పడంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు పోలీసులపై దాడులకు పాల్పడిన విషయం తెలిసింది. పచ్చగూండాల పైశాచికత్వానికి మొత్తం 27 మంది పోలీసు అధికారులు, సిబ్బంది గాయపడ్డారు. ఈ క్రమంలో బాధితులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. 7 నియోజకవర్గాల పరిధిలో ఎక్కడికక్కడ నిరసనలు, ర్యాలీలు, బైక్ ర్యాలీలు చేపట్టింది. చంద్రబాబు కుట్ర రాజకీయాలను ఎండగట్టింది. శాంతిభద్రతలు పరిరక్షించే పోలీసులపైనే టీడీపీ గూండాలు దాడి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

స్వచ్ఛందంగా సహకారం

పోలీసులకు మద్దతుగా వైయస్సార్‌సీపీ నిర్వహించిన బంద్‌కు అన్ని వర్గాలవారు స్వచ్ఛందంగా సహకరించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ దుకాణాలు, వ్యాపార సముదాయాలను మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా మూతపడ్డాయి. అత్యవసర సర్వీసులు మాత్ర యథావిధిగా నడిచాయి. బంద్ కారణంగా సామాన్యులు ఇబ్బంది పడకుండా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకున్నారు.

- పుంగనూరులోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పోలీసులకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు.
- చిత్తూరు మార్కెట్ యార్డ్ వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లా ఆస్పత్రి వద్ద ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి నేతృత్వంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పాదయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ వద్ద శాంతియుతంగా ధర్నా చేపట్టారు.
- పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బంద్ చేపట్టారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.
- కుప్పంలో బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలిపారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. దుకాణదారులు స్వచ్ఛందంగా తమ షాపులను మూసివేసి బంద్‌కు పూర్తిగా సహకరించారు.
- పూతలపట్టు కూడలి వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేశారు. పోలీసులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు.
- నగరి నియోజకవర్గంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరి పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. బస్టాండ్ నుంచి బైపాస్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు.
- జీడీ నెల్లూరు నియోజవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చంద్రబాబు దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్వేటినగరం, గంగాధర నెల్లూరులో శాంతియుతంగా నిరసన తెలిపారు. చంద్రబాబుపై కేసు నమోదు చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పూతలపట్టు క్రాస్ రోడ్డులో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



చంద్రగిరి : చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడిన కార్యకర్తలు

పూతలపట్టులో పచ్చకుట్రలు



ఘర్షణకు వచ్చిన టీడీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

పూతలపట్టు: పూతలపట్టులో శనివారం అల్లర్లు సృష్టించేందుకు టీడీపీ శ్రేణులు యత్నించాయి. వైఎస్సార్‌సీపీ చేపట్టిన బంద్‌లో భాగంగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారు. సకాలంలో పోలీసులు స్పందించడంతో తిరుగుముఖం పట్టారు. వివరాలు.. శుక్రవారం రాత్రి పూతలపట్టులో చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగించారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడి చేసేందుకు తెగబడ్డారు. టీడీపీ బ్యానర్లను ధ్వంసం చేశారంటూ ఘర్షణకు దిగారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి జోక్యం చేసుకోవడం పరిస్థితి సద్దుమణిగింది. దీనిపై ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఫ్రస్టేషన్‌లో అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.



పుంగనూరులో ఆందోళనకు దిగిన నేతలు



చిత్తూరులో డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు



నగరి : రోడ్డుపై బైఠాయించిన రాంప్రసాద్‌రెడ్డి తదితరులు



నిర్మానుష్యంగా చిత్తూరు గాంధీరోడ్డు కూడలి



చిత్తూరు గాంధీ సర్కిల్ నిరసన తెలుపుతున్న విజయానందరెడ్డి తదితరులు



పలమనేరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



జీడీనెల్లూరు : కృపాలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నేతలు



కుప్పం : ఎమ్మెల్యే భరత్ ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు



చిత్తూరులో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

శ్రీహరి 'కరుణ'


- టీటీడీ చైర్మన్‌గా మరో మారు ఎమ్మెల్యే భూమన నియామకం
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- గత సంస్కరణలను నెమరు వేసుకుంటున్న స్థానికులు

తిరుమల: టీటీడీ పాలక మండలి చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మరోమారు నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రస్తుత చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పదవీకాలం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఆయన స్థానంలో ఎమ్మెల్యే భూమన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా భూమన చేతికి టీటీడీ పగ్గాలు రావడం ఇది రెండోసారి. 2006–08 మధ్య కాలంలో టీటీడీ చైర్మన్‌గా కొనసాగారు.

సంస్కరణలకు మారుపేరు భూమన

గతంలో భూమన కరుణాకరరెడ్డి అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. అందులో కొన్ని..

- దళిత గోవిందం కింద దళితవాడల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించారు.
- పేదలైన శ్రీవారి భక్తులు వివాహం కోసం వారి కోసం కల్యాణమస్తు అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.
- ప్రత్యేక క్యూ ఏర్పాటు చేసి ఏడాదిలోపు చంటి పిల్లలు, వారి తల్లిదండ్రులకు శ్రీవారి దర్శనం కల్పించారు.
- శ్రీవారి వైభవాన్ని చాటేలా 2007లో ఎస్వీబీసీ భక్తి చానల్‌ను స్థాపించారు.
- చైతన్య రథయాత్ర, విద్యాధన పథకం, పిల్లలకు ఉచిత పుస్తకాలు, మహిళా క్షురకులు, ఎస్టీలకు అర్చకులుగా ట్రైనింగ్, ఉచిత లడ్డూ, శ్రవణం ప్రాజెక్ట్, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ఇలా.. ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు.





భూమన కరుణాకరరెడ్డి

అరుదైన అవకాశం

ముఖ్యమంత్రులైన తండ్రీకొడుకుల వద్ద టీటీడీ చైర్మన్‌గా కొనసాగే అరుదైన అవకాశం భూమనకు దక్కింది. ఆయన వైఎస్ కుటుంబానికి అత్యంత ఆప్తుడు. ప్రజాప్రస్థానం పేరుతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన పాదయాత్రలో చురుగ్గా పాల్గొన్నారు. 2006 నుంచి రెండేళ్లపాటు టీటీడీ చైర్మన్‌గా కొనసాగారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఈనేపథ్యంలో 2012 ఉప ఎన్నికల్లో.. 2019 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున తిరుపతి నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


మురళి మృతదేహం

నగరి : మండలంలోని మాంగాడు గ్రామంలో శనివారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. గ్రామానికి చెందిన మురళి(31) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఓ ఆస్పత్రిలో చికిత్సపొందాడు. అయినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

చిత్తూరు అర్బన్: నగరంలోని సంతపేటకు చెందిన ఓ బాలిక(10)పై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంతపేటకు చెందిన తిలక్ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి బాలకను తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడన్నారు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

పోలీసులకు మంత్రుల పరామర్శ



చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పోలీసులను పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కార్పొరేషన్/ చిత్తూరు అర్బన్ : పుంగనూరు ఘటనలో తీవ్రంగా గాయపడి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , డీఐజీ అమ్మిరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, మేయర్ అముద, నగరపాలక కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం పరామర్శించారు.

అదే జగన్‌కు బాబుకు తేడా

ప్రజాసంకల్ప పాదయాత్రను జగనన్న ప్రశాంతంగా ముగించారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. అదే బాబు , లోకేష్, పవన్ చేపట్టిన యాత్రల్లో నిత్యం అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అదే జగన్‌కు బాబుకు ఉన్న తేడా అని వెల్లడించారు. పుంగనూరు ఘటనలో చంద్రబాబును మొదటి ముద్దాయిగా చేర్చాలన్నారు.

రాజకీయంగా దివాలా

రాజకీయంగా దివాలా తీయడంతో చంద్రబాబు ఫ్రస్టేషన్‌తో అరాచకాలకు తెగబడుతున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. పుంగనూరులో అల్లర్లు సృష్టించేందుకే పోలీసులకు ఇచ్చిన రూట్‌మ్యాప్‌ను మార్చుకున్నారని మండిపడ్డారు. కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై దాడి చేయించడం చంద్రబాబు రాక్షస ప్రవృత్తికి నిదర్శనమని ఆరోపించారు.పుంగనూరు ఘటనకు కారకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

పోలీసులపై దాడి సరికాదు

పోలీసులపై దాడి చేయడం సరికాదని విశ్రాంత పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారక్షణే పరమావధిగా విధులు నిర్వర్తించే పోలీసులపై చేసిన దాడికి అల్లరి మూకలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

దురుద్దేశంతోనే దాడి

దురుద్దేశంతోనే పోలీసులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఉదయ్ మండిపడ్డారు. పథకం ప్రకారమే ఆయుధాలను తెచ్చుకున్నారని ఆరోపించారు. నిందితుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ఈ ఘటనను ఖండించాలని కోరారు.

ఆశలు మడుగులో కలిసిపోయాయి!

- నీట మునిగి వ్యవసాయ విద్యార్థి మృతి
- మద్దెమానుమడుగు ప్రాజెక్టు వద్ద ఘటన


సురేంద్రనాథ్‌రెడ్డి(ఫైల్)

వెదురుకుప్పం: అసలే తండ్రిని కోల్పోయిన ఆ కుటుంబానికి తనయుడే పెద్ద దిక్కు అవుతాడన్న ఆశలు మడుగులో కలిసిపోయాయి. ఉన్నత విద్యను అభ్యసించేందుకు రాష్ట్రాలు దాటి వెళ్లి వచ్చినా చివరకు గంగపాలయ్యాడు. సరదా కోసం తోటి విద్యార్థులతో కలిసి వెళ్లిన ఓ విద్యార్థి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన వెదురుకుప్పం మండలంలోని మారేపల్లె సమీపంలో ఉన్న మద్దెమానుమడుగు ప్రాజెక్టు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు...కర్నూలు జిల్లా బనగానపల్లెకు చెందిన కే. సురేంద్రనాథ్‌రెడ్డి(22) జైపూర్‌లోని జగన్నాథ యూనివర్సిటీలో అగ్రికల్చరల్ బీఎస్సీ కోర్సు మూడేళ్లు చదివాడు. నాలుగో సంవత్సరం రేణిగుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రాజెక్టు పనుల కోసం ఇటీవలే వచ్చాడు. ఈ క్రమంలో 30 మంది విద్యార్థులు ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు మూడు రోజులుగా వెదురు కుప్పం వచ్చారు. శనివారం వెదురుకుప్పం రైతు భరోసా కేంద్రంలో ప్రాజెక్టు పనులు ముగించుకున్నారు. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో 15 మంది స్నేహితులతో కలిసి సరదా కోసం మూడు కిలో మీటర్ల దూరం లో ఉన్న మద్దెమాను మడుగు ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. ప్రాజెక్టులో 10 మంది విద్యార్థులు ఈత కోసం వెళ్లారు. ఈత కొడుతూ కొందరు అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. మిత్రులతో కలిసి ఈత కొడుతున్న సురేంద్రనాథ్‌రెడ్డి ప్రాజెక్టు మధ్యలోకి వెళ్లి ఆగిపోయారు. అప్పటికే ఆయాసం ఎక్కువవడంతో అటు వెళ్లలేక, ఇటు రాలేక మునిగిపోయాడు. అతనితోపాటు ఉన్న స్నేహితులు సైతం అతని పరిస్థితిని గమనించి ఎలాగైనా ఒడ్డుకు చేర్చాలనే ప్రయత్నం చేశారు. అయినా నేను వస్తానులే వెళ్లండి అని చెప్పిన సురేంద్రనాథ్‌రెడ్డి నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందినట్లు స్నేహితులు తెలిపారు. జరిగిన సంఘటనను సురేంద్రనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. కళ్లెదుటే కలిసి మెలసి తిరిగి కళ్లెదుటే నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన స్నేహితుడిని తలుచుకుని మిత్రులు కుమిలిపోయారు. మృత దేహాన్ని వెలికి తీసేందుకు పుత్తూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలియడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

టిఫిన్ సెంటర్ దగ్ధం


అగ్నికి ఆహుతవుతున్న దుకాణం

సోమల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో శనివారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో దుకాణం పూర్తిగా దగ్ధమైంది. వివరాలు.. సోమల దిడ్డివారిపల్లెకు చెందిన అమరావతి అనే మహిళ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తోంది. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసింది. అప్పటికే దుకాణం దాదాపు కాలిపోయింది. ప్రమాదంలో సుమారు 50వేల నష్టం వాటిల్లినట్లు ఫైర్ అధికారి సుబ్బరాజు తెలిపారు.

సహనం.. సంయమనం


సీఐ భాస్కర్‌ను పరామర్శిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ

చిత్తూరు అర్బన్: పుంగనూరు వద్ద టీడీపీ శ్రేణులు సృష్టించిన అల్లర్లలో గాయపడిన పోలీసులను డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందజేశారు. సంయమనం కోల్పోకుండా వ్యవహరించినందుకు అభినందించారు. ఈ సందర్భంగా బాధిత పోలీసులు 'సాక్షి'తో మాట్లాడారు.

ఎంత చెప్పినా వినలేదు

చంద్రబాబు రూట్ టౌన్‌లోకి కాదు, బైపాస్ మీదుగా వెళుతుంది. మీరు వెళ్లిపోండి అని టీడీపీ కార్యకర్తలకు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సార్ చెబుతూనే ఉన్నారు. ఆయన మాటలను ఎవరూ వినిపించుకోలేదు. పైగా ఆయనపై రాళ్లు వేశారు. నేను, మా సిబ్బంది అప్రమత్తమై డీఎస్పీకి అడ్డుగా నిలబడ్డాం. వెంటనే డీఎస్పీని పోలీసు వాహనంలోకి ఎక్కించాం. ఆయనకు ఏమీ కాలేదు కానీ, నా తల వెనుక రాయి తగిలి రక్తగాయమైంది. గొడవలు వద్దు వెళ్లిపోండి అని ఎంతగా చెబుతున్నా.. కొందరు టీడీపీ నేతలు తమ కార్యకర్తలను మాపై ఉసిగొల్పారు. వాళ్లను కొట్టండ్రా అంటూ రెచ్చగొట్టారు. ఆ పరిస్థితిలోనూ ఎంతో సంయమనంతో వ్యవహరించాం.

– భాస్కర్, సీఐ, చిత్తూరు సీసీఎస్

అడ్డుకోకుంటే వల్లకాడే..



మాకు రాజకీయాలు అక్కర్లేదు. ప్రజలను కాపాడడం మా కర్తవ్యం. కొందరు ఇప్పుడు వ్యాఖ్యానిస్తున్నారు. టీడీపీ వాళ్లను వదిలేసి మీరు వచ్చేయాల్సింది అని. ఆ సమయంలో మేం అడ్డుకోకుంటే పుంగనూరు వల్లకాడుగా మారిపోయేది. రాళ్ల దాడిని ఎదుర్కొంటూ ఎస్టీఎఫ్ సిబ్బంది ధైర్యంగా ముందుకు వెళుతున్నా.. అల్లరి మూకలను ప్రతిఘటించడం సాధ్యం కాలేదు. పెద్ద పెద్ద రాళ్లను మాపై విసరడంతో నా చేయి ఎముక విరిగింది. ఒళ్లంతా రాళ్ల దెబ్బలే. అయినప్పటికీ ప్రజలకు ఏం కాకుండా రక్షించగలిగినందుకు ఆనందంగా ఉంది.

– ప్రసాద్, ఎస్ఐ, పాలసముద్రం

పథకం ప్రకారమే దాడి



టీడీపీ కార్యకర్తలు పథకం ప్రకారమే దాడికి దిగారు. చంద్రబాబు పర్యటనపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు శాంతియుతంగా నిరసన తెలియజేసి వెళ్లిపోయారు. పరిస్థితి మొత్తం అదుపులోనే ఉండగా సాయంత్రం 3.30 గంటలకు టీడీపీ నేత చల్లా బాబు వచ్చి కార్యకర్తలను రెచ్చగొట్టారు. దీంతో వాళ్లు ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించారు. చేతిలో గార్డులను అడ్డుపెడితే అవి కూడా పగిలిపోయాయి. ఇంతలో ఓ రాయి వచ్చి నేరుగా నా ఎడమ కంటిని తాకడంతో అంతా చీకటైపోయింది. తేరుకునేలోపు మరో రాయి నేరుగా తలకు తగిలింది. ఇంకా బీరు బాటిళ్లు సైతం విసురుతున్నారు. అయినప్పటికీ శాంతిభద్రతల కాపాడేందుకు సహనంతో ఉండిపోయాం. మా సిబ్బంది అప్రమత్తమై నన్ను ఆస్పత్రికి తరలించారు.

– బాబు ప్రసాద్, డీఎస్పీ, చిత్తూరు దిశ స్టేషన్

పకడ్బందీగా స్వాతంత్య్ర వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఈ మేరకు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. జేసీ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన చిత్తూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు సర్వం సిద్ధం చేయాలన్నారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ప్రగతి సందేశాన్ని పక్కాగా రూపొందించాలని స్పష్టం చేశారు. ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగుల వివరాలను కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ రేణుక, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీఈఓ విజయేంద్రరావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

కోర్టు కేసులపై అలసత్వం వద్దు


కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు

రెవెన్యూకు సంబంధించి నమోదైన కోర్టు కేసులపై అలసత్వం లేకుండా కసరత్తు చేయాలని జేసీ ఆదేశించారు. ఆయా కేసుల వివరాలను తహసీల్దార్లు నాలుగు రోజుల్లో పంపించాలని సూచించారు. భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.